క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సేవలపై శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమస్యలను, సూచనలను తన దృష్టికి తేవాలని, ఇందు కోసం 99592 25781 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

వేతనాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు వెంటనే వేతనాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. డ్రైవర్లు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. 37 మంది డ్రైవర్లకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణాధ్యక్షుడు చంటి, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

ప్రొద్దుటూరు : గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోని ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్ కన్సల్టెన్సీ కమిటీ మెంబర్లను నియమిస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కోశాధికారి సి.విజయలక్ష్మి, యాదవ్ నరేష్, పర్లపాడు గౌరీశంకర్‌లను నియమించారు. తమ నియామకానికి సహకరించిన కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వని వైష్ణవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, పార్టీ నేతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి ధనుర్మాస పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం సందర్భంగా రోజూ తిరుప్పావై పాశురాలను పఠించనున్నట్లు ఆలయ ట్రస్ట్‌కమిటీ వారు ఒక ప్రకటనలో తెలిపారు. 23న ముక్కోటి ఏకాదశి, జనవరి 12న 108 మట్టిపాత్రల్లో శ్రీకృష్ణునికి పాయసాన్న నివేదన, 14న ఉదయం 10.30 గంటలకు శ్రీగోదాదేవి రంగనాయకుల స్వామి కల్యాణోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

మహిళల రక్షణకు చట్టాలు

ప్రొద్దుటూరు క్రైం/ప్రొద్దుటూరు : మహిళల రక్షణ కోసం పటిష్టమైన చట్టాలు ఉన్నాయని వన్‌టౌన్ ఎస్ఐ హైమావతి తెలిపారు. పెద్దశెట్టిపల్లెలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ హైమావతి, కడప సఖి వన్ స్టాప్ సెంటర్ సైకాలజిస్టు, మహిళాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతినిధి పీవీ సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఉద్యోగాలు చేస్తున్న సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కుల గురించి వివరించారు. ఆపదలో ఉన్నప్పుడు మహిళా హెల్ప్‌లైన్ 181, 112 అనే నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామమోహనరెడ్డి పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ



విక్టర్‌బాబుకు లాప్‌టాప్‌ను అందజేస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయసేవా కేంద్రంలో శుక్రవారం తీట్ల విక్టర్‌బాబు అనే విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను సేవామృతం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమెరికాలో స్థిరపడిన ఓ డాక్టర్ సహకారంతో అందచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ చౌటపల్లెకు చెందిన విక్టర్‌బాబు అరుణాచల్‌ప్రదేశ్‌లో నీట్ సీటు సాధించాడన్నారు. కూలీలుగా పనిచేస్తున్న విక్టర్ తల్లిదండ్రులు సుజాత, యాకోబ్‌లు తమ కుమారుడిని చదివించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. విషయాన్ని గమనించిన ఉపాధ్యాయులు సాయికుమార్, వెంకటేష్ సేవామృతం ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.40 వేల విలువ చేసే ల్యాప్‌టాప్, హార్డ్‌డిస్క్‌లను అందచేశారన్నారు.

ఆరోగ్యం ఎంతో ముఖ్యం

మైదుకూరు : లక్ష్య సాధనకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తహీనతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తహీనతపై అవగాహన కలిగి ఉండటం మంచిదని తెలిపారు. రక్తహీనతను అధిగమించేందుకు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు లలిత జ్యోత్స్న రెడ్డి, రీన సింధూర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రొద్దుటూరు : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, మండలంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ ఈఈ జి.శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు



బద్వేలు అర్బన్ : సచివాలయం ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, నాయకులు

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక 24వ వార్డు పరిధిలోని 26వ సచివాలయం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సహకారంతో ఈ సచివాలయం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు, అర్హత ఉన్న వారందరికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి పథకాలు అందని వారు ఉంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారికి పథకాలు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కమాల్ బాషా, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, కౌన్సిలర్లు జిలాన్ బాషా, సత్యం, మహ్మద్ గౌస్, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, నూకా నాగేంద్రరెడ్డి, వడ్ల ఖలీల్, 25వ వార్డు ఇన్‌చార్జి నూరి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నీటి కాశయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపిద్దాం

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటేనే పేదల జీవితాలు మరింత బాగుపడతాయని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గుంతపల్లె సచివాలయం ఆవరణలో శుక్రవారం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి అనంతరం సచివాలయం పరిధిలోని ఆయా కుటుంబాలకు గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. అనంతరం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ పుత్తా శ్రీరాములు, ఆయా వార్డుల కౌన్సిలర్లు రామ్మోహన్, నారాయణరెడ్డి, ప్రతాప్‌కుమార్, బాబు, నాగేశ్వర్‌రావు, శ్రీనివాసనాయుడు, మౌలాలి, షఫి, సుబ్బారెడ్డి, రామచంద్రనాయుడు, వెంకటసుబ్బయ్య, కేశవయ్య, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములకు ఘన నివాళి



ప్రొద్దుటూరు కల్చరల్ : మాట్లాడుతున్న ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు



మైదుకూరు : పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సభ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లైట్‌పాలెం సెంటర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా శుక్రవారం పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అమ్మవారిశాల నుంచి ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ఊరేగింపుగా లైట్‌పాలెం సెంటర్‌కు చేరుకున్నారు. ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధనకు ప్రాణాలు అర్పించిన మహనీయుడని పొట్టిశ్రీరాముల త్యాగాన్ని కొనియాడారు. ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మురికి సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు అజరామరం

మైదుకూరు : అమరజీవి పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డును ఇవ్వాలని మైదుకూరు ఆర్యవైశ్య సభ నాయకులు కోరారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక అమ్మవారిశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి అమరజీవి చిత్రపటంతో ర్యాలీ బద్వేలు రోడ్డులోని మార్కెట్ సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ నాయకులు మాట్లాడుతూ తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే అభిలాషతో పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ ఉపాధ్యక్షుడు హరికిషన్, సెక్రటరీ డీవీ సునీల్, కోశాధికారి ఎలిశెట్టి గురుప్రసాద్, ధనపాల రవి, వెంకటేశ్వర్లు, రమణయ్య, మలిపెద్దు హరినాథ్, సంజీవ్‌కుమార్, వేణుగోపాల్, మారుతి, సంజీవ్ కుమార్, వేణుగోపాల్, మారుతి, శికాకొల్లు గోపాల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించిన అధికారులు

ప్రొద్దుటూరు : సమస్యల పరిష్కారం కోసం నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఏకంగా అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేశారు. దీంతో ప్రభుత్వం లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూరల్ సీడీపీఓ అరుణ కుమారి, అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ హైమావతి, సూపర్‌వైజర్లు, సచివాలయం సిబ్బంది ద్వారా మూసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించారు. యధావిధిగా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తామని వారు అన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టుతోపాటు అర్బన్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కొంత మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తమ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించడం దారుణమని సీఐటీయూ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరుస్తున్న అధికారులు

జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలను తెరచిన అధికారులు

చాపాడు: మండల వ్యాప్తంగా శుక్రవారం అన్ని గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వ అధికారులు తెరిచారు.

ఎంపీపీకి అంగన్వాడీ వర్కర్ల వినతి:

సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో ఉన్న అంగన్వాడీ వర్కర్లు శుక్రవారం ఎంపీపీ లక్షుమయ్యకు వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీపీని కోరారు.

పశువులకు మెరుగైన వైద్యం అందజేయాలి




వైఎస్సార్ సంచార పశువైద్యశాల వాహనాన్ని తనిఖీ చేస్తున్న రీజనల్ ప్రోగ్రామ్ మేనేజర్ కలీమ్

బద్వేలు అర్బన్ : 108, 104 అంబులెన్స్‌ల తరహాలో మూగజీవాల వైద్యం కోసం ఏర్పాటు చేసిన సంచార పశువైద్యశాల (1962) వాహనాలు రైతులకు అందుబాటులో ఉండాలని, పశువులకు మెరుగైన వైద్యం అందజేయాలని వైఎస్సార్ సంచార పశువైద్యశాల వాహనాల రీజనల్ ప్రోగ్రామ్ మేనేజర్ కలీమ్ పేర్కొన్నారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో శుక్రవారం బద్వేలు, పోరుమామిళ్ల సంచార పశువైద్యశాల వాహనాలను ఆయన తనిఖీ చేశారు. వాహన పనితీరు, వాహనంలోని ల్యాబొరేటరీ, వ్యాక్సిన్లు, మందులు ఎంత మేర ఉన్నాయో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యానికి భద్రత కల్పించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంచార పశువైద్యశాల సిబ్బంది అంకితభావంతో పనిచేసి సకాలంలో మెరుగైన సేవలందించాలని కోరారు. రైతులు తమ మూగజీవాలు ఏదైనా అనారోగ్యానికి గురైతే 1962 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి సంచార పశువైద్యశాల సేవలను పొందాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సంచార పశువైద్యశాల జిల్లా కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్, పశువైద్యాధికారులు డాక్టర్ అంజలిదేవి, డాక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఎంఐజీ లేఅవుట్ పనులు

- తొలి విడత వారికి లక్కీ డిప్ ద్వారా ప్లాట్లు కేటాయింపు
- మళ్లీ వెబ్ సైట్ ఓపెన్



లే అవుట్‌ను చదును చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఎంఐజీ లేఅవుట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. స్థానిక ఆర్టీఓ కార్యాలయం సమీపంలోని గోపవరం గ్రామ పంచాయతీకి సంబంధించిన 45 ఎకరాల విస్తీర్ణంలో మధ్య తరగతి ప్రజల కోసం ఈ లేఅవుట్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో మొత్తం 5 సెంట్లు, 4 సెంట్లు, 3 సెంట్ల చొప్పున మొత్తం 484 ప్లాట్లను విభజించారు. తొలివిడతగా 202 మందికి సెంటు రూ.5లక్షల చొప్పున విక్రయించి లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు.

అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి

ఎంఐజీ లే అవుట్ అభివృద్ధి పనులకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. లే అవుట్‌లో 60 అడుగుల తారు రోడ్డు, 40 అడుగుల సిమెంటు రోడ్లు నిర్మించనున్నారు. లేఅవుట్ 10 శాతం స్థలాన్ని పార్కును, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించనున్నారు. గత ప్రభుత్వం ఇదే స్థలంలో ఇళ్లను నిర్మించేందుకు వేసిన సిమెంటు దిమ్మెలను ప్రస్తుతం తొలగిస్తున్నారు.

ఏఓ సేవలు మరువలేనివి



ఏఓ అరవిందనాయక్‌ను సన్మానిస్తున్న వ్యవసాయాధికారులు

గోపవరం : మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తూ ఉన్నత చదువుల నిమిత్తం తిరుపతికి వెళుతున్న బి.అరవిందనాయక్ సేవలు మరువలేనివని బద్వేలు, పోరుమామిళ్ళ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ, మురళీధర్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు ఏడీఏ కార్యాలయం వద్ద అరవిందనాయక్ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏలు మాట్లాడుతూ 5 సంవత్సరాలుగా మండలంలో ఏఓగా పనిచేస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందారని, అలాగే మండల రైతాంగానికి కూడా ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు నిరంతరం అందుబాటులో ఉండేవారని తెలిపారు. ఎస్వీ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఎంఎస్సీ సీటు రావడంతో ఉన్నత చదువు కోసం వెళ్ళక తప్పదన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత ఈ ప్రాంతానికే వచ్చి ఆయన సేవలను అందించాలన్నారు. అనంతరం సిద్దవటం, అట్లూరు, బద్వేలు, గోపవరం మండలాలకు సంబంధించిన వ్యవసాయాధికారులు, ఆర్బీకే సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏఓ అరవిందనాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఏఓలు రమేష్, రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

గడప గడపకు నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రతి గడపను సందర్శించి ... అందిన లబ్ధిని ఆరా తీసి ... సమస్యలు ఆలకించి ... పరిష్కారం చూపడమే లక్ష్యంగా కొనసాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ఉద్దేశ్యం నెరవేరుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేసే రూ.20 లక్షల నిధులతో సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఈ కోవలోనే బద్వేలు మున్సిపాలిటీలోని 16, 17 వార్డుల పరిధిలోని ఎస్టీకాలనీ (ఎరుకలవీధి)లో గత కొన్నేళ్లుగా సీసీ రోడ్డు లేక వీధి అధ్వాన్నంగా ఉండేది. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం సంబంధిత వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ సుధ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటిని సందర్శించారు. ఆ సమయంలో అక్కడి ప్రజలు తమ సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.16 లక్షలు మంజూరు చేశారు. దీంతో రోడ్డు పనులకు శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని తమ సమస్యకు పరిష్కారం లభించడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, కౌన్సిలర్ దుద్యకూరు సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జి గురివిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

డీఎంహెచ్ఓ నాగరాజు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

చాపాడు : ఈ నెల 18 నుంచి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులను ప్రజలకు పంపిణీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సాన్స్ కార్యక్రమం, త్వరలో నిర్వహించబోయే కుష్టు వ్యాధి నిర్ధారణ(ఎల్‌సీడీసీ పోగ్రామ్) కార్యక్రమం బాధ్యతగా సర్వే చేయించాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేయాలన్నారు. బీసీజీ టీకా గురించి సర్వే చేయాలని సూచించారు. జనవరి మొదటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఎపిడమాలజిస్ట్ ఖాజామొహిద్దీన్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, జిల్లా ఆరోగ్య విస్తరణాధికారి కేఎస్‌వీ ప్రసాద్, వైద్యాధికారి శ్రీవాణి, మండల ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల నిరసన

పోరుమామిళ్ల: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, జీఓ 21, 31లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ కోరారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వీరయ్య, మహమ్మద్ హుసేన్, కేశవ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మోటారు సామగ్రి పంపిణీ

పోరుమామిళ్ల : రైతు బాగుంటే మొత్తం రాష్ట్రమే బాగుంటుందని విశ్వసించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సియం బాష పేర్కొన్నారు. శుక్రవారం సభాభవనం వద్ద పుల్లివీడు, సిద్దవరం గ్రామాలకు చెందిన 9 మంది రైతులకు జలకళ కింద పొలంలో బోరు, మోటారు ఏర్పాటు చేసుకునేందుకు ఒక్కో రైతుకు రూ. 4 నుండి 5 లక్షల విలువ చేసే పరికరాలు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇస్మాక్, ఉపాధి ఏపీఓ రాజాసాహెబ్, టెక్నికల్ అసిస్టెంట్లు ఖాజా, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేయాలి



మాట్లాడుతున్న డీఈఈ శ్రీనివాసులరెడ్డి

మైదుకూరు : విద్యుత్‌ను ఆదా చేయాలని ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాసుల రెడ్డి అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మైదుకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలకు విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈఈ శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ఒక ఎల్ఈడీ బల్బు మామూలు బల్బు కంటే 80 శాతం విద్యుత్ ఆదా చేస్తుందని, ఏసీ 1 డిగ్రీ సెల్సియస్ తగ్గిస్తే ఆరు శాతం విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. వాటర్ గీజర్ల కంటే సోలార్ వాటర్ హీటర్ వల్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఎక్కువ స్టార్ రేటింగ్ కలిగిన పరికరాలను వాడాలని, వాటి వల్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఏఈ శివకుమార్, కమర్షియల్ ఏఈ అరుణ, టెక్నికల్ ఏఈ అబ్దుల్ జబ్బార్, ఏడీఎంజే ఏఈ ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

ఇంధనం పొదుపు చేద్దాం

గోపవరం : ఇంధనం పొదుపు చేద్దాం – భావితరాలకు వెలుగునిద్దాం అనే నినాదంతో విద్యుత్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ కుళాయప్ప మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్‌ను ఆదా చేయడం అందరి బాధ్యత అన్నారు. విద్యుత్ పొదుపు గురించి ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈలు చిన్నయ్య, షర్మిలారాణి పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న గోవిందమాల భక్త బృందం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శుక్రవారం గోవిందమాల భక్తబృందం ఆధ్వర్యంలో 45 మంది దీక్షదారులు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. పాదయాత్రను మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 22న తిరుమలకు చేరుకుని 23న వైకుంఠ ఏకాదశి నాడు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తిరిగి రానున్నారు. ఈ సందర్భంగా గోవిందమాల దీక్షదారుడు పాతకోట ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ భక్తబృందం ఆధ్వర్యంలో 9వ సారి తిరుమలకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోన ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల : అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు న్యాయమైన సమస్యలు తీర్చాలని 4 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గసభ్యులు రామ్మోహన్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అంబేద్కర్ సర్కిల్‌లో సమ్మె చేస్తున్న అంగన్వాడీల వద్దకు వారు వచ్చి, వారితో పాటు శిబిరంలో కూర్చున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ప్రొద్దుటూరు క్రైం : విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి అన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు మాట్లాడారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మహిళామోర్చా రాష్ట్ర కోశాధికారి సీవీ విజయలక్ష్మి, పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం, బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రటరి కోనేటి కృష్ణప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అభివృద్ధికి సహకరించండి

బి.కోడూరు : బి.కోడూరు సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని బి.కోడూరు సహకార సంఘం అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడపలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణికి బి.మఠం సహకార సంఘం చైర్మన్ సుబ్బారెడ్డితో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.కోడూరు సహకార బ్యాంకులో డ్వాక్రా మహిళలకు విరివిగా రుణాలు అందించడంతో పాటు బంగారు, నగదును భద్రపరుచుకునేందుకు లాకర్ రూములను మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

నూతన నియామకం



చెవుల వెంకటేశ్వర్లు



సుబ్బరాయుడు

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బద్వేలుకు చెందిన చెవుల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుండి వెంకటేశ్వర్లుకు ఉత్తర్వులు అందాయి. ఈయన ప్రస్తుతం బద్వేలు మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్‌గా కూడా కొనసాగుతున్నారు.

ఖాజీపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా మండలంలోని అప్పనపల్లి గ్రామానికి చెందిన పుల్లగూర వెంకట సుబ్బరాయుడు నియమితులయ్యారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

రాజుపాళెం : రాజుపాళెం మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన రూ.5 కోట్ల పనులకు సామాజిక తనిఖీ శుక్రవారం నుంచి ప్రారంభించినట్లు ఏపీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. రాజుపాళెం వెలుగు కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల పనులను చేశారా లేదా అని తనిఖీ చేస్తారని చెప్పారు.